

# రెయిన్ కోటు

నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి

ఆగకుండా కుండపోత పోసినట్లు జోరున వర్షం పడుతోంది. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా ఉన్నయ్యనుకుంటున్న వాళ్ళు ఈ వానను చూసి ఇది వరకు కురవని దానికి బదులుగా ఇప్పుడు తీరుస్తున్నదా అనుకుంటారు.

సరిగ్గా నిన్న సాయంత్రం అయిదు గంటలకు మొదలు పెట్టిందేమో, ఇవాళ మధ్యాహ్నానికి కూడా తగ్గలేదు. జనమంతా ఈ వానవల్ల తమ పనులు పాడైపోయాయని విసుక్కుంటున్నారు. అయినా అటువంటివి ఎవరు పట్టించుకుంటారు. ఎందరు ఎన్నివిధాల విసుక్కుంటున్నా దానికి కాకాపట్టిన వాళ్ళూ లేకపోలేదు. దానిని కోరుకుంటున్న వాళ్ళూ ఉన్నారు. విద్యార్థుల కెంతో సంబరంగా ఉంది. ఉపాధ్యాయులకు కూడా సంబరమేకాని, ఆ హెడ్ మాస్టరు స్కూలుకు వెళ్ళిన తరువాత కాని శలవు ప్రకటించడు. అయినా తప్పకుండా శలవు వస్తుంది కదా అని వాళ్ళకు ఒక తృప్తి.

వర్షం వస్తే సంతోషించే వాళ్ళలో ఇంకో తెగ కూడా ఉన్నారు. ఆ కోవకు చెందినవాడే రావు.

అయితే ఈ వాన మొదలు పెట్టింది ఆదివారం కావడంతోటే అతడు నిస్పృహ చెందాడు. అది రేపటి వరకు ఉంటుందో ఉండదో అని అతని సందేహం. ఈ విషయమే అతడు భార్యతో ముచ్చటిస్తున్నాడు.

"ఏమే ఈ వర్షం రేపటి వరకు ఉంటుం టవా?"

"అబ్బ! ఇంత చిరాకు కల్గిస్తుంటే, ఇది రేపటి వరకు కూడా ఉండాలంటారా" అన్నది అతని భార్య చిరాకుగా.

"అదేమిటే అలా అంటావు. చిన్నప్పుడు చదువు కోలా, 'వానాలు కురియాలి వానదేవుడా, వరిచేలు పండాలి వానదేవుడా' అని."

"సరి. అంతవరకు చదివితే నాకే ఉద్యోగందేనికి?"

చదువు సంగతి వచ్చినప్పుడల్లా ఇలా అనడం ఆమెకు పరిపాటి అయిపోయింది. రావు కూడా విన టానికి అలవాటు పడ్డాడు.

"ఇప్పుడు ఆ విషయం దేనికీ.ఇంతకూ ఈవాన.."

"మీరు టీచర్లైనా బాగుండేది. వర్షం బాగా వస్తే స్కూలు ఉండదు అనుకునేందుకు. వర్షం వస్తే ఆఫీసుకు శలవు ఇవ్వరుగా. వెళ్ళకపోతే శలవు పెట్టాలి. అందులోనూ 'ఎమర్జెన్సీ' రోజులాయె అది మంజూరు కావాలి. అప్పుడుకాని, అయ్యగారు.."

"మొదలు పెట్టావూ."

"మరి మీరు మొదలు పెట్టింది ఆపాలంటే నేను కూడా మొదలు పెట్టాలి."

"ఇంతకూ నేను అనేది.." అంటూ రావు మాటలు నాన్చాడు.

అతని భార్యకు అర్థమయింది. ఒక్కసారి, ఫక్కున నవ్వింది. రావుకు కోపం వచ్చింది.

అసలింతకూ జరిగింది ఇది. రావు ఒక రెయిన్ కోటు ముచ్చటపడి కొన్నాడు. అది ఎంత మహాత్యం కలదో కాని ఇప్పటివరకూ దాన్ని పూజ చేస్తున్నాడు. పాపం ఏ ముహూర్తాన కొన్నాడో కాని దాని అవసరం ఇప్పటివరకూ కలుగలా. దానిని వేసుకు వెళ్ళాలని అతనికి సరదా. అతడు కొన్నప్పటి నుంచి ఇప్పటి వరకూ వర్షం పడలా. అప్పటికే ఒకరోజు మబ్బుగా ఉంటే దానిని బయటకు తీశాడు. అదేం ఖర్మమో కాని ఇంటినుంచి ఆఫీసుకు వెళ్లే లోపలే ఫెళ్ళుమని ఎండ వచ్చేసింది. రావు ప్రాణం పాపం ఉసూరు మంది. ఆ వేళ ఆఫీసులో కొందరు మిత్రులు పరా మర్శించారు కూడా. "ఏమిటోయ్, రావూ ఈరోజు అదోలా ఉన్నా"వని. దగ్గరి మిత్రులు కొందరు ఎగతాళి కూడా పట్టించారు. "ఇంత ఎండ కాసి ఉక్క పోస్తుంటే అది చాలక అన్నట్లు అంత లావు 'రెయిన్ కోటు' కూడా తీసుకువచ్చావు" అని.

రావు వాళ్ళకు ఏమని సమాధానం చెప్పగలడు. అది కాదయ్యా, ప్రొద్దున మబ్బుగా ఉంటే వర్షం వస్తుందేమోనని తెచ్చానని చెబుదా మనుకున్నాడు. అది ఇప్పటి పరిస్థితిచూస్తే అంత సబబుగా తోచలా. వర్షం వస్తే తెలిసేది, వీళ్ళకు, హుం—అని అను కున్నాడు.

ఆ రెయిన్‌కోటును వాడాలని అతడు ఎంతో ఉబలాట పడుతున్నాడు. అందుకే భార్యతో అలా అన్నాడు.

"మరీ పసిపిల్లల్లాగా అదేం కోరికలండీ" అని నవ్వేసింది అతని భార్య.

రావు కూడా నవ్వేశాడు. రేపటిని గురించి ఆలో చిస్తూ రావు ఆరోజును మరిచాడు.

*　　*　　*

రావు కోరుకున్నట్లుగానే తెల్లవారింది. వాన తోటే ప్రారంభమయింది ఆరోజు. రావుకు బ్రహ్మా నందమయింది. అతడు ఎంతో ఉత్సాహంగా పనులన్నీ ముగించుకొని భోజనం వడ్డించమని భార్యను తొందర పెట్టడం మొదలు పెట్టాడు

"అబ్బ, అంత తొందర పెడితే ఎలాగండీ"

"అవతల టైమవుతుంది ఆఫీసుకు."

"ఈ వెధవ వర్షం వలన ఇంకా కాలేదివాళ్ళ

అయినా ఇంకా స్వెటరు కొనలేదు కదా. రోజూ నేను తెచ్చింది వదిపిల్లో ఏరిస్తే కానీ వచ్చేవారు కారు."

"త్వరగా కానీ."

"భయపడకండి. ఈ వర్షం ఇప్పుడిప్పుడే వెలిసేదు లెండి. ప్రొద్దున్నే వచ్చిన వానా, ప్రొద్దుగూకి వచ్చిన చుట్టం పోరట. ఆ రోజంతా ఉంటారట."

"ఈ కబుర్లకేంగాని, ఇంతకీ ఇవాళ నన్ను ఆఫీసుకు పంపించదలచుకున్నావా లేదా?"

"అయిపోయింది ఇదిగో ఒక్క నిముషం."

భోజనం పూర్తిచేశాడు రావు. దుస్తులు వేసుకున్నాడు. పెట్టెతీసి అందులో ఉన్న రెయిన్‌కోటు తీసి మడతలను ఎంతో పదిలంగా విప్పాడు. జాగ్రత్తగా తొడుక్కున్నాడు. టోపీకూడా పెట్టుకున్నాడు. నిలువుటద్దం ముందు నిలుచుని తన ప్రతిబింబాన్ని తనివితీరా చూసుకున్నాడు. "ఎలా ఉందే" అని భార్యను అడిగాడు.

ఆమె ఒకసారి ఆపాదమస్తకమూ పరీక్షించి చూసింది. "ఆ కోటు క్రింద పాంటు కనబడుతోంది. అది తడిసిపోతుంది. పైకి మడుచుకోండి" అన్నది.

"ఛీ, ఛీ అలాచేస్తే అసహ్యంగా ఉంటుందే."

"తడిసిపోతుందని చెపుతుంటే అసహ్యం అనుకుంటే ఎలాగండీ. మరి అటువంటప్పుడు ఇంత లావు పాటు కోటు దేనికీ."

రావుకు భార్యమాట కాదంటం ఇష్టం లేదు. పాంటును మడవక తప్పలేదు. అసలే పాపం పొడుగాటి మనిషేమో కోటుక్రింద కాళ్ళు కనబడుతున్నవి. "సరేవస్తా" నని భార్యకుచెప్పి బయటకు

# రెయిన్ కోటు

వచ్చాడు రావు. ఆఫీసుకు బయలు దేరాడు. వర్షం పడుతూనే ఉంది. రోడ్లమీద గుంటలన్నీ నీళ్లతో నిండిపోయి ఉన్నవి. చాలా రద్దీగా కూడా ఉన్నవి. ఏదో ఆనందంలో నడుస్తున్నరావు తన పక్కనుంచే పోయిన కారును గమనించలేదు. అది గమనించే లోపల ఆ కారు తన శక్తికొద్దీ మట్టినీళ్ళను అతని కోటుమీద కొట్టి వెళ్ళడం కూడా అయింది. ఆ కారువాడిని నానాతిట్లు తిట్టుకున్నాడు. గబగబా బస్సు స్టాండుకు చేరుకున్నాడు.

ఇంతలో బస్సు వచ్చింది. బస్సు ఎక్కి కలయజూశాడు రావు. బస్సు అయితే ఖాళీగానేవుంది. కాని వర్షం పడుతున్నప్పుడు కండక్టరు కిటికీ తలుపులు వేయలేదల్లే ఉంది. అన్ని సీట్లూ సగం తడిసి ఉన్నాయి. రావు కోటు విప్పకుండానే అలాగే ఒక తడిసిన సీటుపై కూర్చున్నాడు. అలా కూర్చుంటున్నప్పుడు అతని కోటునుంచి జారిన నీళ్లు పొడిగా ఉన్న ప్రక్కసీటును కూడ తడిపాయి. ఆ సీటులోనే కూర్చోబోతున్న వ్యక్తికి కోపం వచ్చింది.

"బాబూ, కాస్త ఆ గంతను తీసికూర్చోగూడదూ" అన్నాడు.

"ఏమిట"న్నట్లుగా చూశాడు రావు.

"చూడండి కోటు నుంచి కారిన నీళ్లతో ఈ సీటు తడిసిపోయింది. కోటు తీసి కూర్చుంటే ఏంపోయేదీ అని అన్నాను. అసలే ఉన్న సీట్లన్నీ సగం తడిసిపోయాయి. దానికితోడు కొద్దిగా మట్టి అయినా ఈ రెయిన్ కోటువాలాలకు ఉన్న జబ్బే ఇది." అంటూ ఆ వ్యక్తి ఏదేదో అనడం మొదలు పెట్టాడు. దానికితోడు ప్రక్కన ఉన్నవాళ్ళుకూడా అతనికే మద్దతు ఇవ్వడం మొదలు పెట్టారు. పరిస్థితి గమనించిన రావు కిక్కురుమనలేదు.

'సారీ' చెప్పి కూర్చున్నాడు. కోటు గుండీలు విప్పాడు. అతనికి ఆ వ్యక్తిమీద కోపం వచ్చింది. తనకోటు పాడైందని అసలే తనకు ఇదిగా వుంటే పైగా ఇదొకటి. వాళ్ళకు లేకపోయేప్పటికి ఓర్వలేరు. స్థానబలిమి లేనిచోట మాట్లాడకుండా ఉండడమే మంచిది.

ఇంతలో అతడు దిగవలసిన 'స్టాపు' వచ్చింది. ఏవో ఆలోచనలలో ఉన్న రావు అది గమనించలేదు. బస్సు మళ్లీ కదలబోయేసరికి చూశాడు వెంటనే ఆదరాబాదరాగా లేచాడు. కోటు గుండీలు కూడా పెట్టుకోలేదు. ఆ తొందరలో అతని కోటు ఇటూ అటూ ఊగుతున్నది. అలా అయితే బాగానేవుండేది. ఆ కోటు పోయి ప్రక్కనున్న వాళ్లను పరామర్శించుతోంది. వాళ్ళంతా ఒకటే గోల.

"ఏమయ్యోయ్. కాస్త ఆ కోటును పట్టుకొని పోరాదూ, అందరకూ అలా తగిలించకపోతే." అని ఒకరన్నారు.

"పాపం కొత్త మయిపోయిందిగా. నిద్రపోయి నట్టున్నాడు ఇప్పటిసరకూ దిగకుండా. ఎవరినన్నా సెక్రటరీని పెట్టుకో నిద్రలేపేందుకూ, కోటు పట్టుకునేందుకూ." అన్నారు ఇంకొకరు.

"అవతారం మాస్తీ అలాగే వుంది" అన్నారు వేరొకరు, తన మడిచిన పాంటును ఎగతాళి చేస్తున్నట్లుగా.

రావుకు బాగా కోపం వచ్చింది. విసురుగా ఒక్క వూపు వూపి బస్సుదిగాడు. నెమ్మదిగా నడుచుకుంటూ ఆఫీసు చేరుకున్నాడు. అతనిని చూసిన మిత్రులు సంతోషించారు. అందరూ వానతో విసుగెత్తి ఉన్నారు.

"సాయంకాలంలోగా వాన వెలిసిపోవడం ఖాయం" తీర్మానించారు ఒకరు.

"అదేమిటి రెండు రోజులవరకూ ఇలాగే ఉంటుందని ప్రొద్దున్నేగా రేడియోలో చెప్పారు." అన్నారు ఇంకొకరు.

"మన రావు రెయిన్‌కోటు తీసుకు వచ్చినప్పుడు ఎప్పుడయినా వర్షం వచ్చిందీ. ఇవాళ అంతే. ఇంతకన్నా కరెక్టయిన వెదర్ రిపోర్టు ఇంకేమి కావాలోయ్." అని వేరొకరన్నారు.

అన్నీ వింటున్న రావుకు మతిపోయినంత పని అయింది. అసలు దారిలోనే రెయిన్ కోటంటే అతనికి సరదా సగంపోయింది. ఈ మాటలతో ఆ మిగిలిన సగంకూడా పోయింది.

సాయంకాలానికి వర్షం తగ్గిపోతే బావుండు ననుకున్నాడు. అతని కోర్కె ప్రకారమో లేక అతని మిత్రులన్నట్లు అతని రెయిన్‌కోటు ప్రభావమో మధ్యాహ్నం నుంచే వర్షం తగ్గుముఖం పట్టి సాయంకాలానికి తగ్గిపోయింది. రావు రెయిన్‌కోటు కూడా పెట్టెలో ముడుచుకుపోయింది. ●

